క్లుప్తంగా

పేదలకు సాయంలోనే ఆనందం



ప్రత్తిపాడు: పేదలకు సేవ చేయడంలోనే ఆనందం ఇమిడి ఉంటుందని ఆంథోని విజయ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఆనంద్‌కుమార్ తెలిపారు. క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు మండలం రావిపాటివారిపాలేనికి చెందిన ఆంథోని విజయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నూతన వస్త్రాల్ని బహూకరించారు. గుంటూరు నగరంలోని ఆర్‌సీఎం యూపీ స్కూల్, వేళంగిణీ నగర్ ఎలిమెంటరీ స్కూలు, లాం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లోని రెండు వందల మంది పేద విద్యార్థులకు మేనేజింగ్ డైరెక్టర్ ఫాదర్ మర్రి అనిల్ కుమార్ చేతుల మీదుగా ట్రస్టు సభ్యుల సమక్షంలో నూతన వస్త్రాల్ని విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఆంథోని కనికరం, తులసి, వరలక్ష్మి, పాఠశాలల యాజమాన్యం పాల్గొన్నారు.

మహిళల అక్రమ రవాణాకు పాల్పడితే జైలు



ప్రత్తిపాడు: మహిళల అక్రమ రవాణాకు పాల్పడితే జైలు తప్పదని ప్రత్తిపాడు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళల అక్రమ రవాణా నిరోధంపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. ఏపీఎం సురేష్ మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రజ్వల సంస్థ సీనియర్ కో-ఆర్డినేటర్ వై. చంద్రయ్య మాట్లాడుతూ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ప్రజ్వల సంస్థ ద్వారా 27 సంవత్సరాలుగా మహిళల అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని తెలిపారు. ఐసీడీఎస్, పోలీస్, జ్యుడీషియల్ శాఖల సహకారంతో ఇప్పటి వరకు 29 వేల మంది యువతులు, మహిళల్ని కాపాడి వారికీ పునరావాసం కల్పించినట్లు చెప్పారు. అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ నేటి యువత ఇంటర్నెట్, మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కి గురి అవుతున్నారని, వారిని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించి, సమాజ జాగృతి సంఘాల్ని ఏర్పాటు చేసి ప్రజల్ని చైతన్య పరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రెసిడెంట్ మరియమ్మ, సీసీలు సుబ్బారావు, పూర్ణయ్య, అయ్యమ్మ, వీవోలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ప్రథమ స్థానంలో ఉండటమే లక్ష్యం

అప్పాపురం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థి ప్రథమ స్థానంలో ఉండేలా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ తెలిపారు. మండలంలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల్ని సొంత బిడ్డల్లా చూసుకుంటూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఒకటి నుంచి ఐదవ తరగతిలో ప్రథమస్థానంలో ఉన్న విద్యార్థుల్ని అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సాల్మన్‌రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రక్తహీనతతో ప్రాణాపాయం

- పిల్లలు, యువత, గర్భిణుల్లో అధికం
- అశ్రద్ధ చేస్తే ప్రమాదం

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వల్ల నేడు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు మొదలుకొని కళాశాల యువత కూడా రక్తహీనత బారిన పడుతున్నారు. గర్భిణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. గుంటూరు జిల్లాలో 2023 ఏప్రిల్ నుంచి నవంబరు వరకు 12,697 మంది గర్భిణులు ఉన్నట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. వీరిలో 7,146 మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా జూన్ నుంచి డిసెంబరు వరకు 7,636 మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. నివారించని పక్షంలో గర్భిణులు కాన్పు సమయాల్లో మృతి చెందుతారు. జిల్లాలో ప్రతినెలా మాతృ మరణాల నివారణ కోసం నిర్వహించే సమీక్షలో గర్భిణులు రక్తహీనత వల్లే చనిపోతున్నట్లు వైద్యాధికారులు నిర్ధారణ చేస్తున్నారు. రక్తహీనత నివారించదగినదే. కొద్దిపాటి అవగాహన కల్గి ఉండి జాగ్రత్తలు తీసుకుంటే దరిచేరదనే విషయాలను వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

రక్తహీనత అంటే...

రక్తానికి హిమోగ్లోబిన్ అనే పదార్థంతో ఎర్రని రంగు వస్తుంది. ఇది ఇనుము అనే లోహానికి సంబంధించినది. శరీరంలో రక్తం ఉండాల్సిన పరిమాణంలో లేకపోయినా, ఉండాల్సిన పరిమాణంలో ఉండి అందులో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్నా దాని రక్తహీతన(ఎనీమియా) అంటారు.



రక్తహీనతపై అవగాహన పోస్టర్

రక్తహీనతకు కారణాలు

- ఆహారంలో ఇనుముకు సంబంధించిన పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు, ప్రోటీన్లు తగినంత లేకపోవడం.
- రక్తం ఉత్పత్తయ్యే దానికన్నా గర్భస్రావాలు, కాన్పులు, నెలసరి రుతుస్రావం, మొలలు మొదలైన వాటి వల్ల ఎక్కువగా శరీరం నుంచి రక్తం పోవడం.
- రక్తం తక్కువ తయారు కావటం, లేదా శరీరం నుంచి ఎక్కువ రక్తం బయటకు పోవడం.
- పేదల్లో సాధారణంగా ఉండే పోషకాహారం లోపం
- కొందరికి వారి తినే కొన్ని పదార్థాలు, కొన్ని మందుల వల్ల వస్తుంది.
- వివిధ ప్రోటీన్లు, విటమిన్ సీ, జింకు, రాగి వంటి ఖనిజాలు, మరికొన్ని ఇతర విటమిన్లు లోపం వల్ల, ఇనుము సరఫరా తగ్గిపోవడం.
- సీ విటమిన్ లోపంతో పళ్ల నుంచి రక్తం కారి స్కర్వీ వ్యాధి వల్ల వస్తుంది.
- పేగుపూత, కడుపులో మంట, గ్యాస్ట్రబుల్ ఉన్నవారు ఏది తిన్నా కడుపులో మంట వస్తుంది. దీని వల్ల వారు ఏమీ తినకపోయినా, మంచి పోహకాహారం తీసుకోకపోయినా అది శరీరానికి వంటబట్టక రక్తహీనత వస్తుంది.
- తరచూ నీళ్ల విరోచనాలతో బాధపడేవారికి తిన్నది వంటబట్టకపోయినా వస్తుంది.
- ఐరన్, ఫోలిక్ యాసిడ్, బీ-12, థైరాక్సిన్ లోపం
- కడుపులో పురుగులు రక్తం పీల్చుకోవటం వల్ల, రక్తం గడ్డకట్టే లక్షణం కోల్పోయిన హిమోఫీలియా వంటి అరుదైన జబ్బు ఉన్నవారికి వస్తుంది.

లక్షణాలు...

నీరసం, ఆకలి మందగించటం, ఆయాసం, పని మీద శ్రద్ధ లేకపోవటం, కాళ్లు చేతులు నొప్పులు, కొద్దిసేపు పనిచేసినా అలసిపోవటం, శరీరం పాలిపోయినట్లు ఉండటం, ఛాతీ నొప్పి, గుండెదడ, కళ్ళు తిరగటం, ఉన్నట్లుండి బైర్లు కమ్మటం, కింద పడిపోవటం వంటి లక్షణాలు రక్తహీనత ఉన్నవారిలో కనిపిస్తాయి. బాగా ఎక్కువగా ఉంటే పాదాలు, కాళ్లు, ముఖం వాయటం, నీరు చేరటం, భుజాల దగ్గర, నడుంలో, కీళ్లలో నొప్పులు ఉంటాయి. గోళ్లు, పెదాలు, పాలిపోవటం, గోళ్ల మధ్యలో చెంచాలాగా గుంటలు పడటం, నున్నగా మెరిసే నాలుక, పాలిపోయిన చిగుళ్లు, కంటి కింద రెప్పలోపలభాగం తెల్లగా ఉండటం, నాడి ఎక్కువగా కొట్టుకోవటం తదితర లక్షణాలు ఉంటాయి.

నివారణ చర్యలు

మహిళలు గర్భం వచ్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు ప్రతిరోజూ ఫోలిక్ యాసిడ్ మాత్ర మింగాలి. సీ విటమిన్ లభించే దానిమ్మ, ద్రాక్ష, బత్తాయి, చీని, నిమ్మ, నారింజ, కమలాలు, రేగు, ఉసిరి తినాలి. ప్రతి మనిషికీ రోజుకు కనీసం 30 మిల్లీ గ్రాముల ఇనుప ఖనిజం అవసరం. విటమిన్ బీ1, విటమిన్ బీ2, ఫోలిక్ యాసిడ్, విటమిన్ సీ అన్నీ కలిసి ఇనుప ఖనిజం శరీరానికి తగినంతగా అందించేందుకు తోడ్పడతాయి. రక్తం పుష్కలంగా తయారవ్వటానికి తాజా పండ్లు, ఆకు కూరలు, గోంగూర, పాలకూర, బచ్చలికూర, తోటకూర, చిక్కుళ్లు, బఠానీలు, సజ్జలు, రాగులు, లివర్, గ్రుడ్లు, చేపలు, పప్పులు, బెల్లం ఎక్కువగా తీసుకోవాలి.

త్వరగా గుర్తించి నివారించాలి



రక్తహీనత స్త్రీలలో, పిల్లల్లో మరీ తీవ్రంగా ఉండి 5 నుండి 8 గ్రాముల మధ్య ఉంటే రోగ నిరోధక శక్తి తగ్గిపోయి త్వరగా జబ్బులకు గురవుతారు. గర్భిణీల్లో రక్తహీనత వల్ల వారికి పుట్టే పిల్లలు బరువు తక్కువగా పుడతారు. ఒక్కోసారి పుట్టిన వెంటనే బిడ్డ చనిపోతారు. కొన్నిసార్లు తల్లికూడా చనిపోయే ప్రమాదం ఉంది. రక్తహీనత ఉన్నవారు సరిగ్గా ఊపిరి పీల్చుకోలేకపోతారు. పిల్లలు ఎక్కువసేపు ఆటలు ఆడలేరు. చదువులో వెనుకబడిపోతారు. రక్తహీనతను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా నివారించవచ్చు.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, స్త్రీ, ప్రసూతి, సంతాన సాఫల్య నిపుణురాలు, గుంటూరు

ఉచితంగా మాత్రల పంపిణీ

చిన్నపిల్లల్లో రక్తహీనత నివారణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో సిరప్, పౌష్టికాహారం , పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందిస్తున్నాం. కౌమార దశలో ఉండే బాలికలపై ప్రత్యేక దృష్టి సారించి వారిలో రక్తహీనత నివారణ చర్యలు తీసుకుంటున్నాం. గర్భిణీకి పేరు నమోదు చేసిన మూడో నెల నుంచే రక్తహీనత నివారణ కోసం ప్రత్యేక ప్రణాళికతో వైద్యసేవలను అందిస్తున్నాం. మాత్రలు అందించటంతోపాటు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇచ్చి అవసరమైతే రక్తం కూడా ఉచితంగా ఎక్కించి రక్తహీనత నివారణా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

భవిష్యత్‌లో పర్యావరణహిత సాధనాలకు డిమాండ్

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శనివారం రోల్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ ఎనర్జీ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా వీవీఐటీ పూర్వ విద్యార్థి, హెచ్‌వీఎల్ పవర్ సిస్టమ్స్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లీడ్ ఇంజనీర్ ఎం. అశోక్ భూపతికుమార్ హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యుత్ పొదుపు, పర్యావరణహితమైన సాధనాల రూపకల్పనకు మంచి డిమాండ్ ఉందన్నారు. అందుకు అనుగుణంగా పరిశ్రమలు వ్యవస్థలు, మార్పు చెందుతున్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ దిశగా నూతన ఆవిష్కరణలు చేయడం ద్వారా పర్యావరణానికి కూడా మేలు జరుగుతుందని చెప్పారు. గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో హరిత సాంకేతికతపై మక్కువ చూపుతున్నారని, తద్వారా ఇంధన ఆదాతో పాటు పర్యావరణహిత ఉపకరణాల వినియోగం పెరుగుతుందని చెప్పా రు. అనంతరం డాక్టర్ అశోక్ భూపతిని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ కె. గిరిబాబు, ఈఈఈ విభాగాధిపతి ఎ.వి. నరేష్‌బాబు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



డాక్టర్ అశోక్‌భూపతిని సత్కరిస్తున్న విద్యాసాగర్

ఆరోగ్యకర ప్రపంచాన్ని సృష్టించడం ఫార్మాసిస్టు బాధ్యత

గుంటూరు రూరల్: ఆరోగ్యకర ప్రపంచాన్ని సృష్టించే బాధ్యత ప్రతి ఫార్మాసిస్టుపై ఉందని కె.ఎల్. యూనివర్సిటీ వీసీ కె.ఎస్. జగన్నాథరావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో శనివారం ఇంటర్‌నేషనల్ సొసైటీ ఫర్ ఫార్మాకోఎకనామిక్స్ అండ్ ఔట్ రీసెర్చ్, ఏఎన్‌యూ స్టూడెంట్ చాప్టర్ సహకారంతో జాతీయస్థాయి ఫార్మా క్విజ్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జగన్నాథరావు మాట్లాడుతూ వైద్యుడు వ్యాధికి తగిన ఔషధాల్ని మాత్రమే సూచించగలరన్నారు. ఆ తర్వాత వాటిని ఏ విధంగా, ఎంత మోతాదులో వినియోగించాలనే వివరాలను తెలియజేయాల్సిన బాధ్యత ఫార్మాసిస్టులదేనని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఐఎస్‌పీఓఆర్ సభ్యుల సహకారంతో తమ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత మెడికల్, హెల్త్ ఎవేర్‌నెస్ క్యాంపులు, క్విజ్‌లు వివి ధ రకాల పోటీల్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత క్విజ్ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 కళాశాలల నుంచి 80 టీంలు పాల్గొన్నాయని చెప్పారు. చలపతి ఫార్మసీ కళాశాలకు ప్రథమ బహుమతి, ప్రియదర్శిని కళాశాలకు ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతుల్ని చలపతి ఫార్మసీ కళాశాల దక్కించుకుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఎస్‌పీఓఆర్ ఏఎన్‌యూ స్టూడెంట్ చాప్టర్ అధ్యక్షులు వి.ఎస్. మేఘన, చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు పాల్గొన్నారు.



క్విజ్ పోటీలలో విజేతలతో కళాశాల యాజమాన్యం

తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి

కొల్లిమర్ల(కాకుమాను): ఇటీవల మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసే విధంగా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు కోరారు. మండలంలోని కొల్లిమర్ల, తెలగాయపాలెం, చినకాకుమాను గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని శనివారం పొన్నూరు ఏడీఏ వి.రామకోటేశ్వరి, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసి రైతుల్ని ఆదుకోవాలని తెలిపారు. తుపాన్ కారణంగా మండలంలో అన్ని గ్రామాల్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి ఎకరాను పరిశీలించి పంట నష్టపోయిన ప్రతి రైతు పేరు నమోదు చేయాలని ఆయన కోరారు. ఏడీఏ రామకోటేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులెవరికీ ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు పంట నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి పేర్లు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొల్లిమర్ల సర్పంచ్ విప్పడపు రాంబాబు, కృష్ణ, ఏవో కె.కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

కాకాని శివాలయంలో భక్తిశ్రద్ధలతో యాగాలు

పెదకాకాని: స్థానిక శివాలయంలో శ్రీ కోటి లలితానామ జప యజ్ఞ పూర్వక ఏకాథ కుండాత్మక సప్తమ సహస్ర చండీ మహారుద్ర నవగ్రహ లక్ష్మీ గణపతి మహాయాగాల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనరు నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. తెనాలికి చెందిన విష్ణుభట్ల ఆంజనేయ చయనులు పర్యవేక్షణలో పూజలు జరుగుతున్నాయి. 50 మందికి పైగా ఋత్విక్కులు పాల్గొన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు ప్రాతఃకాల పూజలు, చండీ సప్త శతీ హోమం, రుద్ర, నవగ్రహ హోమాలు, బాల, సుహాసినీ పూజలు, శ్రీచక్రార్చన, వేదపారాయణం, జపాలు నిర్వహించారు.



యాగంలో పాల్గొన్న ఋత్వికులు

సీఏలు, కంపెనీ సెక్రటరీలకు పుష్కల అవకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశం ఆర్థికంగా బలోపేతం కానున్న నేపథ్యంలో సీఏలు, కంపెనీ సెక్రటరీలకు పుష్కలమైన అవకాశాలున్నాయని హైదరాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) కేంద్ర పాలక మండలి సభ్యుడు రాజవోలు వెంకటరమణ పేర్కొన్నారు. శ్రీనివాసరావుతోటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ కార్యాలయంలో శనివారం ఇసీఏఐ, ఐసీఎస్ఐ-అమరావతి చాప్టర్ సంయుక్తంగా ఎల్ఎల్‌పీ, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలపై ఒక్క రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ భారతదేశం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందని, ఇందులో ప్రైవేటు, పబ్లిక్ రంగ సంస్థలతో పాటు ఎల్ఎల్‌పీలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఆయా సంస్థలు నియమ, నిబంధనలకు అనుగుణంగా నడవడంలో సీఏలు, కంపెనీ సెక్రటరీ (సీఎస్)ల పాత్ర ఎంతో ఉందని వివరించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రవితేజ

నైపుణ్యతతోనే త్వరితగతిన ఉపాధి

గుంటూరు రూరల్: నైపుణ్యతలు కలిగిన విద్యతోనే విద్యార్థులు త్వరితగతిన ఉపాధిని పొందగలరని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యాధర్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా బెంగుళూరుకు చెందిన ఫార్మా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డీన్ ఉమానందన్ మిశ్రా, హైదరాబాద్‌కు చెందిన అరగాన్ లైఫ్ సైన్సెస్ ప్రతినిధి సువీర్ శ్రీవాస్తవ బృందం విద్యార్థులకు గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్, గుడ్ లేబరేటరీ ప్రాక్టీస్, క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అష్యూరెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అత్యధిక మార్కులు సాధించిన వారికి బహుమతులు అందజేశారు. అతిథులను కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి సీహెచ్. శ్రీనివాస్, కోశాధికారి ఆర్. గోపాలకృష్ణ ఘనంగా సన్మానించారు.



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం



మహిళ మెడలో గొలుసు అపహరణ

గుంటూరు రూరల్: ఒంటరిగా వెళుతున్న మహిళ మెడలో బంగారు గొలుసును అపహరించిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గోరంట్ల విష్ణునగర్‌కు చెందిన కె. శివరంజని ఇంటి వద్ద నుంచి నడుచుకుంటూ రోడ్డు పైకి వస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

20న 'జగనన్నకు చెబుదాం'

పొన్నూరు: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 20న జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో పట్టణ, మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యల్ని రాతపూర్వకంగా తెలియజేస్తే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంపై గ్రామాల్లో ప్రజలకు తెలియజేసే విధంగా అవగాహన కలిగించాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

సంక్రాంతి వరకు అయ్యప్పలకు సద్ది

గుండవరం(చేబ్రోలు): మండలంలోని గుండవరంలో గల తిరుపతమ్మ తల్లి ఆలయం సమీపంలో నిర్మించిన అయ్యప్ప స్వామి మందిరంవద్ద గత నెల 29వ తేదీ నుంచి స్వాములకు నిత్య సద్దిని ప్రారంభించారు. సంక్రాంతి పండుగ వరకు దాన్ని కొనసాగించనున్నట్లు అయ్యప్ప భక్త బృందం తెలిపింది.


అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతిరాణికి పురస్కారం



జ్యోతిరాణి

ప్రత్తిపాడు: స్థానిక రామానగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న తమలపాకుల జ్యోతిరాణి సావిత్రీ బాయి పూలే విశిష్ట మహిళా పురస్కారానికి ఎంపికయ్యారు. ఆమె రెండు దశాబ్దాలకు పైగా సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ప్రజాచైతన్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె సేవల్ని గుర్తించిన విశాఖపట్నానికి చెందిన సావిత్రీ బాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ గూడూరు సీతామహలక్ష్మి, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ కె.బాబురావు ఆంధ్రప్రదేశ్ నుంచి జ్యోతిరాణిని ఎంపిక చేశారు. పురస్కారాన్ని జనవరి 3న సావిత్రీ బాయి పూలే 193వ జయంతి నాడు విశాఖపట్నంలో అందించనున్నారు. ఈ మేరకు జ్యోతిరాణికి ట్రస్టు నుంచి ఆహ్వానం అందింది. ప్రస్తుతం జ్యోతిరాణి అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అండ్ మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాల్ని నెమరువేసుకునే ఆత్మీయ సమ్మేళనం, జీవితంలో మరువలేని అమృత ఘట్టమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శనివారం 1994-98లో విద్య అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా సందడిగా గడిపారు. యోగక్షేమాలు, వ్యక్తిగత జీవిత విశేషాలను ఒకరినొకరు పంచుకున్నారు. కళాశాల ప్రాంగణంలో కలియతిరిగారు. తరగతి గదులలో విద్యార్థులుగా మారి పాత మధుర జ్ఞాపకాల్ని గుర్తు తెచ్చుకున్నారు. గురువుల్ని గౌరవించుకున్నారు. తమ కళాశాలలో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందేవిధంగా తయారు చేయడమే లక్ష్యమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. విద్యాభ్యాసం ముగిసి 25 సంవత్సారాలు పూర్తి చేసుకొన్న పూర్వ విద్యార్థులకు కళాశాల సిబ్బంది జ్ఞాపికల్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, డాక్టర్ స్వర్ణశ్రీ పాల్గొన్నారు.

